# యూవ

సమయం... మధ్యాహ్నం ఒంటిగంట...!

స్థలం... విజయవాడ బస్‌స్టేషను...!!

వచ్చిపోయే ప్రయాణీకులతోనూ, బస్సులతోనూ ఆ ప్రాంతమంతా కోలాహలంగా వుంది.

విజయవాడ నుంచి రాజమండ్రీ వెళ్లే బస్సు 'ఫ్లాట్‌ఫాం' మీదకు రాగానే జనాలు ఒకరినొకరు తోసుకుంటూ అందులోకి ఎగబడ్డారు.

గంగాభాగీరథీ సమానురాలైన అనసూయమ్మా, ఆవిడగారి కొడుకు జగన్నాథం అందరి మధ్యనించీ చోటు చేసుకొని ఎలాగో లోపలకు ఎక్కి కూర్చున్నారు.

మొదట్లో తను కూర్చుని కిటికీ దగ్గరి సీటు తల్లికిచ్చి - మధ్యనున్న సీటులో జేబురుమాలు వేసి, తన కొడుకు కోసం 'రిజర్వ్' చేశాడు జగన్నాథం.

మరో అయిదు నిమిషాలకు డ్రైవరూ, కండక్టరూ లోపలకొచ్చారు. అందరి టికెట్లు 'చెక్' చేసుకున్న తర్వాత "స్టార్ట్ చెయ్‌గురూ" అన్నాడు కండక్టరు.

బస్ స్టార్టయింది.

"ఒక్క నిమిషం ఆగు నాయనా, మా మనవడు రావాలి!" - ఖంగారుపడుతూ చెప్పింది అనసూయమ్మ.

ఆ మనవడి పేరు బుచ్చిగణపతి. అయితే అనసూయమ్మ అతన్ని ఎంతో ప్రేమగా 'బుజ్జాలూ' అని - మరీ గారం చేయాల్సివస్తే 'బుజ్జికొండా' అని పిలుచుకుంటుంది. తక్కిన వాళ్ళు 'గణపతీ' అని పిలుస్తారు.

బుజ్జాలకి అయిదో ఏటనే తల్లి మరణించింది. జగన్నాథం మళ్లీ పెళ్ళి చేసుకోలేదు. అనసూయమ్మగారే ఓవైపు కొడుక్కి వండి పెడుతూ మరోవైపు మనవడి ఆలనా పాలనా చూస్తోంది. చదువు సంధ్యలు అంతగా అంటలేదు బుజ్జికి, పదో క్లాసు పరీక్షకి నాలుగైదుసార్లు వెళ్ళినా సత్ఫలితం కనిపించకపోయేసరికి - అతని చదువు మీద ఆశ వదులుకున్నాడు జగన్నాథం. తన తాతముత్తాతలు సంపాదించి ఇచ్చిన ఆస్థిపాస్థులున్నాయి కనుక - త్వరలోనే కొడుకుతో ఏ వ్యాపారమో పెట్టించే ఆలోచన చేస్తున్నాడు...

చదువు రాకపోయినా వయసు రాక మానదుగా!

చూస్తుండగానే బుజ్జికి పాతికేళ్లు వచ్చేశాయి. బుజ్జికంటే ఒకటి రెండు క్లాసులు ఎక్కువ చదివి, రెండు మూడు పాళ్ల తెలివితేటలు ఎక్కువగా వున్న పిల్లను చూసి, ముందు పెళ్లి చేసేస్తే ముందు ముందు అతని వ్యాపారంలో చేదోడువాదోడుగా వుంటుందని భావించిన జగన్నాథం - ఆ ప్రయత్నాలు ప్రారంభించాడు. తనకు తెలిసిన పెళ్ళిళ్ళ పేరయ్యలు నలుగురికీ చెప్పాడు. ఆ నలుగురిలో ఒకాయన రాజమండ్రీ నించి ఓ సంబంధం తీసుకొచ్చాడు. ఇప్పుడు ఆ పెళ్లి చూపులకే కొడుకునీ, తల్లినీ తీసుకుని బయల్దేరాడు జగన్నాథం.

"మీ మనవడెక్కడున్నాడో త్వరగా రమ్మనండమ్మా!... ఇప్పటికే బండి పావుగంట లేటు!" - అన్నాడు కండక్టరు.

జగన్నాథం బస్సు దిగి బుజ్జి కోసం నాలుగువైపులా వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. అనుమానం వచ్చి అక్కడున్న క్యాంటిన్‌లోకి వెళ్లి చూశాడు. ఓ మూల టేబులు ముందు కూర్చుని 'సాంబారిడ్లీ' తింటున్న బుజ్జులు కనిపించాడు.

"ఒరేయ్ దరిద్రుడా! ఇక్కడ మేస్తున్నావా?... అవతల బస్సు బయల్దేరుతోంది... నడు!" - అంటూ అతని చేయి పట్టుకున్నాడు జగన్నాథం.

"అయ్యో! రవ్వదోసె ఆర్డరిచ్చాను నాన్నా!" - చేయి విడిపించుకునే ప్రయత్నం చేస్తూ చెప్పాడు బుజ్జి.

"ఏడిశావ్‌లే... నడు!" - అంటూ మరోమాట వినిపించుకోకుండా అతని రెక్క పట్టుకుని బస్సులోకి లాక్కుపోయాడు.

ఒకటిన్నరకి బయల్దేరిన బస్సు, ఏలూరు, తాడేపల్లిగూడెంల మీదుగా నాలుగయ్యేసరికి తణుకు చేరుకుంది.

"ఎవరైనా కాఫీలూ టీలూ తాగాలనుకుంటే త్వరగా వెళ్లిరండి సార్... పది నిమిషాలు హాల్టు!" - అదరికీ వినిపించేలా "అనౌన్స్' చేసి కండక్టర్ క్రిందికి దిగి వెళ్లాడు.

"బామ్మా! ఇప్పుడే వస్తానే!" - అంటూ బుజ్జి కూడా లేచాడు.

"తొందరగా అఘోరించు... మళ్లీ నీకోసం వెతికి ఛావలేను" - పేపరు చదువుకుంటూ కూర్చున్న జగన్నాథం, కిందకు దిగుతున్న బుజ్జిని హెచ్చరించాడు.

చెప్పినట్టుగానే సరిగ్గా పది నిమిషాలకు కండక్టరు బస్సులోకి వచ్చి గంట కొట్టాడు. డ్రైవరు కూడా ఎక్కి 'ఇంజన్' స్టార్ట్ చేశాడు.

బుజ్జి మాత్రం ఇంకా బస్సు ఎక్కలేదు.

జగన్నాధానికి ఒకవైపు ఆత్రుత - మరోవైపు కోపం ఎక్కువయ్యాయి.

"ఏవండీ! దిగినవాళ్ళంతా ఎక్కినట్టేనా?" - ఓసారి వెనక్కి తిరిగి చూసి అడిగాడు సీటులో కూర్చున్న కండక్టరు.

"మా మనవడు ఇంకా రాలేదు నాయనా! ఒక్క నిమిషం ఆగు!" - అనసూయమ్మ చెప్పింది తాపీగా.

"ఈయనెక్కడ దొరికాడండీ బాబూ?.... ఆగిన చోటల్లా దిగిపోతున్నాడు" - ఆవిడవైపు చురచురా చూస్తూ విసుక్కున్నాడు కండక్టరు.

మళ్లీ జగన్నాధానికి తప్పలేదు. కిందకు దిగి చుట్టూ చూశాడు. కానీ బుజ్జులు జాడ మాత్రం కనిపించలేదు.

రెండు మూడు నిమిషాలు గడిచిపోయాయి.

ప్రయాణీకుల్లో అసహనం ఎక్కువైంది. కండక్టర్‌కి కూడా చిర్రెత్తుకొచ్చింది.

"రైట్‌రైట్" అన్నాడు కోపంగా.

"అయ్యో. అయ్యో... మా బుజ్జులు ఎక్కలేదు నాయనా, మా అబ్బాయి వెళ్లాడుగా!... చూసి తీసుకొస్తాడు" - అనసూయమ్మ చెప్పింది.

"మీరు కూడా దిగి - అందరూ కలసి తర్వాత బస్సులో రాండమ్మా కావాలంటే!"- అనసూయమ్మ క్కూడా కోపం వచ్చింది.

"ఏమిటీ? బస్సు నీ స్వంతమైనట్టు మాట్లాడుతున్నావ్? ఇది మాలాంటి ప్యాసింజర్ల కోసం నడుపుతున్న బస్సు. ఏభయ్యేసి రూపాయలు పోసి టిక్కెట్టు కొన్నాం.. ఏదో కుర్రకుంక!.. ఆకలేస్తే ఏ హోటల్‌కో వెళతాడు. ఇంతలోనే హడవిడి పడిపోతే ఎలా?" - అంది లేచి నిలబడి.

"అదంతా మాకు తెలీదండీ.. నాలుగున్నరయ్యేసరికి బండి రాజమండ్రీ బస్టాండులో వుండాలి... మళ్లీ ఆరున్నరకి 'రిటర్ను' ట్రిప్పుంది... ఇలా ఆగిన చోటల్లా మీ మనవడి కోసం పడిగాపులు కాయాలంటే మేం ఉద్యోగాలు చేయలేం.. రైట్‌రైట్!!" -

అనసూయమ్మ రయ్ మంటూ ముందుకొచ్చింది.

"రైట్‌రైటా? ఏదీ? బస్సుని స్టార్టు చేయమను చూస్తాను! ఈ స్టాండులోనే బస్సుకి అడ్డంగా పడుకుంటాను ఏమనుకుంటున్నావో?" - ఉరిమినట్టు చూసింది.

పరిస్థితి విషమిస్తోందని గ్రహించిన ప్యాసింజర్లు కొందరు లేచి ఇద్దరికీ సర్దిచెప్పి శాంతింపచేశారు.

"మేం వెళ్లి చూసొస్తాం.... ఉండండి!" - అంటూ ఇద్దరు ప్రయాణీకులు కిందకు దిగారు.

అప్పటికి జగన్నాథం బస్‌స్టాండ్‌లో అంతా వెతికి నిరాశగా తిరిగి రావటం గమనించిన ఆ ప్యాసింజర్లు రోడ్డు మీదకు వచ్చి అటూ ఇటూ చూశారు.

దూరంగా - రైలు పట్టాలకు అవతల ఓ పుచ్చకాయముక్కల దుకాణం ముందు బిక్క ముఖంతో నిలబడి వున్న 'బుజ్జుల్ని' చూశారు...

అయితే అతని ఒంటిమీద షర్టు లేదు.

ఆశ్చర్యపోతూనే - ఆత్రుతగా వాళ్ళిద్దరూ అక్కడకు చేరుకున్నారు.

"అవతల బస్సు వెళ్లిపోతుందేమో... నా చొక్కా నాకిచ్చేయండీ... పైగా పెళ్లిచూపులకు ఇలా వెడితే అంతబాగుండదు కూడానూ... మీకు పుణ్యం వుంటుంది... ఇచ్చేయండీ" - పుచ్చకాయ ముక్కలమ్మే వ్యక్తిని అర్థింపుగా అడుగుతున్నాడు బుజ్జులు.

"నే నివ్వను... నీ బాబుతో చెప్పుకో... ఆట్టే మాట్టాడితే ఆ ప్యాంటు కూడా ఇప్పించేసి పంపిస్తాను... ఏవనుకుంటున్నావో... నాకే టోకరా వేద్దామనుకుంటున్నావా?... మర్యాదగా నాలుగు రూపాయలూ ఇక్కడ పెట్టి - నీ చొక్కా తీసుకెళ్లు!" - అంటున్నాడు పుచ్చకాయల మనిషి.

"ఏమిటయ్యా... ఏమిటి గొడవ? అవతల ఈ పెద్దమనిషి కోసం అక్కడ స్టాండులో బస్సు ఆగిపోయింది!" - అక్కడకొచ్చిన ప్రయాణీకుల్లో ఒకడు కల్పించుకున్నాడు.

"చూడండి సార్! పుచ్చకాయముక్కలు బాగున్నాయని వరసపెట్టి రెండు ముక్కలు తిన్నాడు... నాలుగు రూపాయలైంది... డబ్బిమ్మంటే డ్రామా ఆడుతున్నాడు!" - వాళ్ళకు ఫిర్యాదు చేశాడతను...

"డబ్బులు నేనిస్తానుకానీ ముందు అతని చొక్కా అతనికిచ్చేయ్ తండ్రీ!"- జేబులోంచి అయిదునోటు తీసి అతని ముందు పారేసి - అక్కడున్న చొక్కా తీసి బుజ్జులు కిచ్చి - తక్కిన రూపాయి తీసుకోకుండానే - బుజ్జులు చేయిపట్టుకుని బస్సువైపు నడిచాడు ఆ ప్రయాణీకుడు...

"బాబూ! ఇంక బస్సు ఎక్కడా ఆపకుండా తొందరగా రాజమండ్రీ పోనీయ్ నాయనా!" - అంటూ కండక్టర్‌కి చెప్పి తమ సీట్లలో కూర్చున్నారు ఆ ప్రయాణీకులు...

కొడుకుని చూసి పళ్ళు నూరేడు జగన్నాథం...

"రైట్రైట్" - అన్నాడు కండక్టరు...

బస్సు స్టార్టయింది....

"ఇంతాలస్యం అయిందేం నాన్నా?... ఎక్కడి కెళ్లావ్?" - చీర చెంగుతో మనవడి ముఖం తుడుస్తూ అడిగింది అనసూయమ్మ...

"రోడ్డు మీద పుచ్చకాయముక్కలు అమ్ముతున్నారే బామ్మా! మన బెజవాడలో ఇంకా రావటం లేదు కదా - ఇక్కడ కొనుక్కు తిందామని వెళ్లాను... డబ్బులు ఇద్దామని జేబులో చెయ్యిపెడితే - అయిదు రూపాయల నోటు కనిపించలేదు..."

"ఏమైంది?"

"జేబుకి చిల్లుందిగా... బహుశా పడిపోయి వుంటుంది ఎక్కడో... సమయానికి - ఆ అంకుల్విద్దరూ వచ్చి డబ్బులిచ్చారు... లేకపోతే నా ప్యాంటు కూడా ఇప్పించేస్తానన్నాడు ఆ పుచ్చకాయముక్కలాడు!" - చెప్పాడు బుజ్జులు.

తర్వాత తన కొంగున ముడేసి దాచుకున్న డబ్బులోంచి అయిదు రూపాయల నోటు తీసి - ఆ ప్యాసింజర్‌కి ఇచ్చేసింది అనసూయమ్మ.

బస్సు వేగం అందుకుంది....

★ ★ ★

ఆటో స్పీడుగా వెడుతోంది...

అందులో కూర్చున్న అనసూయమ్మ తన చేతిసంచీలోంచి దువ్వెన్న తీసి మనవడికిచ్చింది.

"ఒరే బుజ్జికొండా! మనం వెళ్లేది పెళ్లిచూపులక్కదా!... ఓసారి తలదువ్వుకో!" - చెప్పింది.

"బామ్మా! పెళ్లివారింట్లో ఫుడ్డుంటుందా" - తలదువ్వుకుంటూ అడిగాడు బుజ్జులు.

జగన్నాథం మరి కోపాన్ని అణచుకోలేకపోయాడు -

"ఫుడ్డుకాదు - గాడిదగుడ్డుంటుంది. బస్సెక్కేముందు బకాసురుడిలా ఇంట్లో భోంచేశావ్... బస్‌స్టాండ్‌కి వచ్చాక అక్కడి హోటల్లోకెళ్లి సాంబారిడ్లీ మెక్కేవ్... బస్సు ఎక్కింతర్వాత - బామ్మ తెచ్చిన బందరు లడ్డూలు మింగేవ్... అదీచాలక పుచ్చకాయముక్కలు మేశావ్... ఇంతలోనే మళ్లీ ఫుడ్డా?... నీది కడుపు కాదురా... ఖండవిల్లి మడుగు!" - అన్నాడు కళ్లెర్ర చేసి పళ్లు కొరుకుతూ.

మనవణ్ణి అంతలేసి మాటలనడం విని భరించలేకపోయింది అనసూయమ్మ.

"చాల్లే... ఊరుకో... నరుడి కంటికి నల్లరాయి బద్దలవుతుంది తెలుసా? వయసులో వున్న పిల్లాడు. రాళ్లు తిని హరాయించుకునే శక్తుంది కనుక తింటున్నాడు. అంతమాత్రం చేత అంతగా విసుక్కోవాలా ఏమిట్రా?... పాపం... అసలే తల్లి లేని బిడ్డ!" - బుజ్జులు

తల నిమురుతూ అంది అనసూయమ్మ.

"అదిగో... నువ్వలా అస్తమానూ వాణ్ణి వెనకేసుకురావటం వల్లనే - ఇలా మొద్దబ్బాయిగా తయారయ్యాడు. వయసొచ్చిందన్న మాటేగానీ బుద్ధీ జ్ఞానం కొంచెమైనా రాలేదు. అస్తమానూ చిరుతిళ్లూ చిలిపి వేషాలూ, యూస్‌లెస్‌ఫెలో!"

"అదిగో... ఆ తిట్టే వద్దన్నాను. నిక్షేపంగా మీనాన్నగారి పేరెట్టుకుని చీటికీ మాటికీ తిట్టిపోస్తావెందుకూ?" కొడుకుని మందలించిందామె.

వీళ్ళగొడవ బొత్తిగా పట్టించుకోవటం లేదు బుజ్జులు... స్పీడుగా వెడుతున్న ఆటోలోంచి రోడ్డు మీదకు చూస్తున్నాడు... అంతలో అతని దృష్టి ట్రాఫిక్ సిగ్నల్‌కి పక్కగా వున్న హోటల్ మీద పడింది.

"ఒసేవ్ బామ్మా! ఉడిపీ హోటల్ అదిగోనే!.. ఉడిపీ హోటల్లో పుడ్డు బావుంటుందని మా ఫ్రెండు భాస్కర్రావ్ చెప్పాడు.. వెడదామా?" - అడిగాడు.

జగన్నాథంలో కోపం తారాస్థాయికి చేరుకుంది -

"ఇదిగో!... పెళ్లి చూపులతంతు ముగిసి - మళ్లీ మనం బస్‌స్టాండుకి వచ్చేదాకా 'పుడ్డూ - గిడ్డూ' అన్నావంటే నడ్డి విరగ్గొడతాను జాగ్రత్త!" - బుజ్జులకి తొడపాశం పెట్టి మరీ చెప్పాడు....

ఇదంతా 'సైడ్ మిర్రర్' లోంచి చూస్తున్న ఆటోవాలా అన్నాడు -

"ఏమిటిసార్... అబ్బాయిగారికి ఆకలవుతోందేమో... హోటల్‌కి తీసుకెళ్లండి సార్!"

"చాల్చాల్లేవయ్యా.. మధ్య నీ రికమెండేషనొకటా?... హోటల్‌కి వెడితే అక్కడో అరగంటవుతుంది కనుక - నీకు వెయిటింగ్ ఛార్జీ బాగా వస్తుందని ఆశ!... పోనీయ్!" అతని మీద విసుక్కున్నాడు జగన్నాథం....

మరో పది నిమిషాలకు దానవాయిపేటలో - పెళ్లివారింటిముందు ఆగింది ఆటో...

అమ్మాయి తండ్రి ఆంజనేయులు, ఆటో దిగి వస్తున్న పెళ్లివారిని చూసి ఆప్యాయంగా ఆహ్వానించి లోపలకు తీసుకొచ్చాడు.

"వీడేనండీ మా అబ్బాయి.... మా నాన్నగారు పోయిన నెల రోజులకే వీడు పుట్టాడు! అందుకే ఆయన పేరు పెట్టుకున్నాం.... గణపతి!... ఇక ఆవిడ మా అమ్మగారు!" - సోఫాలో సెటిలయిన తర్వాత తన కొడుకునీ, తల్లినీ పరిచయం చేశాడు జగన్నాథం....

ఆంజనేయులు కూడా తన కుటుంబ సభ్యుల్ని వాళ్ళకు పరిచయం చేశాడు.

పరస్పర కుశల ప్రశ్నలు పూర్తయ్యాక - ఆంజనేయులు అడిగాడు బుజ్జుల్ని -

"ఏవయ్యా గణపతిరావ్! నీకు ఏవంటే ఇష్టం?"

"మొదట్లో మొదట్లో నాకు 'పెసరట్టుప్మా' అంటే చాలా ఇష్టంగా వుండేదండి!... మొన్నెప్పుడో మా ఫ్రెండు భాస్కర్రావ్ ఉడిపి హోటల్లో ఊతప్పం తిన్నాట్టండి.. చాలా బావుందని చెప్పాడు.. తెప్పిస్తారాండీ?" - అడిగాడు బుజ్జులు ఆత్రంగా.

తన ప్రశ్నకు బుజ్జులు అలా అర్థం చేసుకున్నందుకు ఆంజనేయులుకి నవ్వొచ్చింది..

"నా ఉద్దేశ్యం - సంగీతం, సాహిత్యం, నాటకం - ఇలాంటి వాటిల్లో నీకు ఏది ఇష్టం అని..." తన ప్రశ్నకు వివరణ ఇచ్చాడు మళ్లీ....

"ముందస్తుగా నాకు ఫుడ్డే ఇష్టమనుకోండి... అందులో..." అంటూ ఏదో చెప్పబోతూంటే - జగన్నాథం అతన్నివారిస్తూ చెప్పాడు-

"చాల్చాల్లే! మాటకి ముందు 'ఫుడ్డు' తప్ప మరో మాట రాదు నీకు!"

ఆంజనేయులు బుజ్జులు వైపే విస్మయంగా చూస్తున్నాడు...

"చూడండి బావగారూ! మా వాడికి కొంచెం తిండి ధ్యాసెక్కువ! చిన్నప్పుడే తల్లిపోయింది కదా! దాంతో మా అమ్మ అతి గారాబం చేసి చిరుతిళ్లు అలవాటు చేసింది... అందుకనీ..." జగన్నాథం వివరించాడు.

అంతలో ఆంజనేయులు భార్య... పెళ్లికూతుర్ని తీసుకొచ్చి - బుజ్జులుకి ఎదురుగా 'చాప' మీద కూర్చోబెట్టింది....

"ఇదేవిటే బామ్మా! అప్పుడే పెళ్లికూతుర్ని తీసుకొచ్చి కూర్చోబెట్టేశారేమిటీ? ఇంక ఫుడ్డు పెట్టరా?" - నెమ్మదిగా బామ్మ చెవిలో అడిగినా - ఆంజనేయులు చెవిలో కూడా ఆ మాటలు పడకపోలేదు...

"చూడు నాయనా! కతికితే అతకదంటారు!... అందుకని ఇలా ఏర్పాటు చేశాం!... అమ్మాయీ నువ్వూ ఒకర్నొకరు చూసుకొని ఒకరి అభిప్రాయాలూ అభిరుచులూ మరొకరు తెల్సుకోవటం పూర్తయితే - అప్పుడు టిఫిన్ తినొచ్చు!" - చెప్పాడాయన.

'అలాగే' అన్నట్టుగా తలూపి - పెళ్లికూతుర్ని ప్రశ్నించాడు బుజ్జులు -

"మీ పేరేమిటి?"

"బాలాత్రిపురసుందరి!" - చెప్పిందామె.

"చూడండి బాలాత్రిపురసుందరి గారూ!.. మరీ... మీకేమిష్టమండీ?"

"నాకు రామాయణం అంటే ఇష్టం... రాముడి పాత్ర అంటే మరీ ఇష్టం!"

ఈ సమాధానం అతనికి 'రుచి'ంచలేదు.

"నా ఉద్దేశ్యం అది కాదండీ! ఫుడ్డు! ఏ ఫుడ్డంటే ఇష్టం అని?... చైనీసా?..

నార్తిండియనా? సౌతిండియనా?" - అడిగాడు వెంటనే.

"అన్నీ ఇష్టమే!" - సిగ్గుపడుతూ చెప్పిందామె.

"వంట చేయటం వచ్చునా?"

"కొంచెం... కొంచెం...! మా అమ్మనేర్పింది!"

"అటుకుల పులిహోర చేయటం వచ్చునా?" - అడిగాడు బుజ్జులు.

రాదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"పోనీ గోంగూర పచ్చడి చెయ్యగలరా?"

"ఊహూ.. రాదు!"

"అది కూడా రాదా?... అయితే ఆవపెట్టి పనసకాయ కూర వండగలరా?"

రాదన్నట్టుగా ఇబ్బందిగా చూసింది బాలాత్రిపురసుందరి.

అది గ్రహించిన అనసూయమ్మ సద్దుబాటు చేయబోయింది -

"అవన్నీ నెమ్మదిగా నేర్చుకుంటుందిలేరా బుజ్జులూ!"

బుజ్జులికి కోపం వచ్చింది -

"నేర్చుకుంటుందా? ఎప్పుడు నేర్చుకుంటుందే బామ్మా? నాకెపుడు చేసి పెడుతుంది?... అయినా ఆవపెట్టి పనసకాయ కూర చేయటం చేతకాని ఆడపిల్లను పెళ్లెట్లా చేసుకునేదే?" - బుంగమూతి పెట్టి మరీ అడిగాడు.

అప్పటికి విషయం బోధపడింది ఆంజనేయులుకి...

"అయ్యా! మీ అబ్బాయికి తిండి ధ్యాస 'ఎక్కువ' అని మీరంటే ఏమిటో అనుకున్నాను... కానీ 'ధ్యాస' కంటే 'యావ' ఎక్కువని అర్థమవుతోంది" అన్నాడు.

"ఏదో చిన్నతనం కదా బాబూ! పెళ్ళయి బాధ్యతలూ బరువులూ నెత్తిన పడితే - ఆ ధ్యాస కొంచెం తగ్గిపోతుందిలే" - అనసూయమ్మ మళ్లీ సర్దిచెప్పబోయే ప్రయత్నం చేసింది....

బుజ్జులు కోపం మరింత పెరిగింది.

"ఎంచక్కా పెళ్లి చేసుకుంటే - పెళ్లాంవస్తే 'ఫుడ్డు' బాగా చేసిపెడుతుంది కదా అని నేననుకుంటే - ఆ ధ్యాస తగ్గిపోతుందంటావేవిటే బామ్మా... నిజంగానే తగ్గి పోతుందా?.. అయితే నాకీ పెళ్లే వద్దసలు!" - అంటూ ఛివాల్న లేచాడు.

ఆంజనేయులు కూడా లేచి కూతుర్ని గదిలోకి పంచించి వాళ్లతో అన్నాడు -

"చూడండి బాబూ!... మీ అబ్బాయికి కావాల్సింది పెళ్లిచూపులూ, పెళ్లాం కాదు.. కాఫీ హోటలూ - వంటలక్కా!"

"అదీ... అలా చెప్పండి మానాన్నకి - నేనిందాకట్నించీ అడుగుతున్నాను ఉడిపీ హోటల్‌కి తీసుకెళ్లమని!.. వింటేనా?" - తండ్రిపై ఫిర్యాదు చేస్తున్నట్టు అన్నాడు బుజ్జులు.

"చాల్లాల్లే! చేసిన నిర్వాకం చాలుగానీ పద!" - అంటూ అతని చేయి పుచ్చుకుని బయటకు నడిచాడు జగన్నాథం... అనసూయమ్మ కూడా వాళ్ళను అనుసరించింది.

★ ★ ★

సమయం. సాయంత్రం ఆరున్నర...!

స్థలం రాజమండ్రీ బస్‌స్టేషను...!

వచ్చీపోయే ప్రయాణీకులతోనూ, బస్సులతోనూ ఆ ప్రాంతమంతా కోలాహలంగా వుంది.

రాజమండ్రీ నించి విజయవాడ వెళ్ళే ఆఖరి బస్సు ప్లాట్‌ఫాం మీదకు రాగానే - జనాలు ఒకరినొకరు తోసుకుంటూ అందులోకి ఎగబడ్డారు. తల్లినీ కొడుకునీ వెంట బెట్టుకుని ఎలాగో లోపలకు ఎక్కి కూర్చున్నాడు జగన్నాథం...

డ్రైవరు వచ్చి 'హారన్' మోగించాడు... కానీ కండక్టర్ ఎక్కలేదు!

అయిదు నిమిషాలు.. పది నిమిషాలు... అరగంట... గడిచిపోయింది....! అయినా కండక్టర్ జాడ కనిపించలేదు.

"త్వరగా కండక్టర్ని పిలిచి బస్సు స్టార్ట్ చేయవయ్యా బాబూ" - అన్నాడు బస్సులో కూర్చున్న ఓ ప్రయాణీకుడు.

డ్రైవరు కిందకు దిగాడు.

మళ్లీ అయిదు నిమిషాలు.. పది నిమిషాలు... అరగంటపైగా గడిచిపోయింది.. ప్రయాణీకుల్లో చిరాకూ, అసహనం ఎక్కువైయ్యాయి....

సరిగ్గా ఆ సమయంలో డ్రైవరు వచ్చాడు.

"ఈ బస్సు ఇవాళ వెళ్ళదు!" - అన్నాడు.

అందరూ తెల్లబోయారు.

"ఏం? ఎందుకనీ?" - అడిగారు అందరూ ముక్త కంఠంతో.

"కండక్టర్ సడెన్‌గా సిక్కయి సెలవు పెట్టేశాడు!" - చెప్పాడు డ్రైవరు.

ప్రయాణీకులంతా అయోమయంగా చూశారు...

మళ్లీ అపుడు డ్రైవరే చెప్పాడు -

"బస్సు ఎక్కుదామని వస్తున్నాట్ట.... ఇంతలో లోపలకు ఎక్కుతున్న ప్రయాణీకుల్ని

ఎవర్నో చూసి - 'వామ్మో - వీళ్లు మళ్లీ వస్తున్నారే - నా ప్రాణానికి' - అనుకుంటూ హఠాత్తుగా వెనుదిరిగి - స్టేషన్ మేనేజర్ దగ్గరికెళ్లి తాను 'సిక్' అవుతున్నట్టు చెప్పొట్ట!"

జగన్నాథం, అనసూయమ్మా తేలుకుట్టిన దొంగల్లా ఒకరిముఖాలొకరు చూసుకుంటూంటే బుజ్జులు అంటున్నాడు -

"అయితే ఎంచక్కా బస్సు దిగి ఉడిపి హోటల్‌కి వెడదామే బామ్మా!"

(విపుల
సెప్టెంబర్ 1997)

* * *